బీసీలకు యాభైశాతం ఇళ్లను కేటాయించాలి


మంత్రి కోమటిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న రాజేశ్వర్‌యాదవ్

బర్కత్‌పుర, మే 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం త్వరలో అందజేసే ఇందిరమ్మ డబుల్ బెడ్ రూం ఇళ్ల కేటాయింపులో బీసీలకు యాభైశాతం ఇళ్లను కేటాయించి న్యాయం చేయాలని జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు రాజేశ్వర్‌యాదవ్ విజ్ఞప్తి చేశారు. గురువారం రాష్ట్ర రోడ్లు భవనాల శాఖమంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని తన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభాలో 55 శాతం ఉన్న బీసీలకు న్యాయం జరగాలంటే ఇళ్ల కేటాయింపులో ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించారని, బీసీలకు తగు న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు సాయివర్ధన్, మల్లేష్, రావిచారి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 31 వరకు ఉచిత ఫిజియోథెరపీ శిబిరం

బర్కత్‌పుర, మే 23 (ఆంధ్రజ్యోతి): పక్షవాతంతో బాధపడే వారికి ఈ నెల 24 నుంచి 31 వరకు ఉచిత ఫిజియోథెరపీ చికిత్స శిబిరం నిర్వహిస్తున్నట్లు హ్యూమానిటీ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ కొండా శ్రీనివాస్‌రావు తెలిపారు. కాచిగూడ రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న శ్యామ్ మందిర్ ప్రాంగణంలోని మెడికల్ సెంటర్‌లో ఉచిత ఫిజియోథెరపీ చికిత్సా శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కీళ్లనొప్పులకు ఆధునిక పరికరాలతో చికిత్సతోపాటు ఫిజియోథెరపీ కిట్స్‌ను పంపిణీ చేస్తున్నట్లు ఆయన చెప్పారు. ప్రతి రోజు సాయంత్రం ఆరు గంటల నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు శిబిరం కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు. ఒక వేళ సేవా కేంద్రానికి రాలేని వారికి ఇంటివద్దే మొబైల్ సేవల ద్వారా చికిత్స అందిస్తామని ఆయన చెప్పారు. పూర్తి వివరాలకు 9949238492 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.


పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, బస్తీ కమిటీ అధ్యక్షుడు భూపతినాథ్, తదితరులు

ఆధ్యాత్మిక చింతనతోనే సమాజంలో శాంతి

● ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

నల్లకుంట, మే 23 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక చింతనతోనే సమాజంలో శాంతి నెలకొంటుందని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. వైశాఖ మాస శుద్ధ పౌర్ణమి గురువారం నల్లకుంట డివిజన్‌లోని నర్సింహబస్తీలో పోచమ్మ ఆలయం 13వ వార్షికోత్సవం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలని, సుఖసంతోషాలతో ప్రశాంతంగా జీవించాలని ఆయన కోరారు. యువతలో ఆధ్యాత్మిక భావన పెంపొందించాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. ఈ సందర్భంగా బస్తీ కమిటీ నేతలు ఎమ్మెల్యేకు శాలువాకప్పి సత్కరించారు. కార్యక్రమంలో నర్సింహబస్తీ కమిటీ అధ్యక్షుడు ఎం. భూపతినాథ్, ప్రధాన కార్యదర్శి ఎన్.శ్రీనివాస్, బస్తీ నాయకులు ఎం. కృష్ణ, మహేందర్, ప్రేమ్‌కుమార్, ప్రసాద్, లక్ష్మణ్, ఓంప్రకాష్, ఎస్. బాబురావు, ఆలయ అర్చకుడు జగదీశ్వర్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.


దేవి థియేటర్‌లో మనం సినిమాను చూస్తున్న అక్కినేని నాగచైతన్య

ప్రేక్షకులతో కలిసి మనం సినిమాను వీక్షించిన నాగచైతన్య

చిక్కడపల్లి, మే 23 (ఆంధ్రజ్యోతి): దాదా సాహెబ్ పాల్కే అవార్డు గ్రహీత డా.అక్కినేని నాగేశ్వరరావు, అక్కినేని నాగార్జున, అక్కినేని నాగచైతన్య కలిసి నటించిన సినిమా మనం రీ రిలీజ్ సందర్భంగా ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని దేవి థియేటర్‌లో నాగచైతన్య గురువారం అభిమానులు, ప్రేక్షకులతో కలిసి వీక్షించారు. ఫస్ట్ షో ఆటకు వచ్చిన ఆయన మొత్తం సినిమా చూశారు. ఆయన వెంట యార్లగడ్డ సుప్రియ కూడా ఉన్నారు. అభిమానులకు ఆయన అభివాదం చేశారు.

కబ్జాదారుల స్థలాన్ని రక్షించాలి

● ఓ బాధితుడి విజ్ఞప్తి


సమావేశంలో మాట్లాడుతున్న హబీబ్ అహ్మద్ ఖాన్

నల్లకుంట, మే 23 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ బోర్డు కేటాయించిన స్థలాన్ని కబ్జాదారుల నుంచి తనకు అప్పగించాలని ఓ బాధితుడు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో నగరంలోని హుమా యున్ నగర్‌కు చెందిన బాధితుడు హబీబ్ అహ్మద్ ఖాన్, న్యాయవాది ఖాజా అర్షత్ అహ్మద్‌తో కలిసి మాట్లాడారు. మహబూబ్‌నగర్ జిల్లా యాదిరా మండలం అప్పన్నపల్లి గ్రామంలో వక్ఫ్‌బోర్డు సర్వే నంబర్ 242, 243 లో తనకు 10 ఎకరాల 19 గుంటల స్థలాన్ని ఒక సంవత్సరానికి గానూ తనకు లీజుకు కేటాయించిందన్నారు. 2023 జూలైలో వక్ఫ్‌బోర్డు నిర్వహించిన బిడ్డింగ్‌లో అత్యధికంగా కోడ్ చేసిన తనకు వక్ఫ్ బోర్డు సాగు కోసం భూమిని కేటాయించిందని ఆయన గుర్తు చేశారు. ఈ భూమిలో కోల్డ్ స్టోరేజ్, వర్టికల్ ఫార్మింగ్‌ల ఏర్పాటు కోసం ప్రణాళికను సిద్ధం చేసుకున్నానని ఆయన తెలిపారు. అయితే ఈ స్థలాన్ని పరిశీలించేందుకు వెళ్లగా ఆ స్థలాన్ని ఆక్రమించిన భూకబ్జాదారులు అక్కడికి వెళ్లకుండా అడ్డుకున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై తాను వక్ఫ్‌బోర్డు, జిల్లా కలెక్టర్, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశానని తెలిపారు. తనకు న్యాయం జరగలేదని ఆయన వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వక్ఫ్‌బోర్డు తనకు కేటాయించిన స్థలాన్ని కబ్జాదారుల నుంచి స్వాధీనం చేసుకుని అప్పగించాలని ఆయన కోరారు.

ప్యాచ్‌వర్క్‌లను వెంటనే పూర్తి చేయాలి

రాంనగర్, మే 23 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ నియోజకవర్గంలోని పలు డివిజన్లలో జలమండలి నిర్వహించిన డ్రైనేజీ లైన్‌లు వేసిన చోట రోడ్డు ప్యాచ్‌వర్క్‌లను వెంటనే పూర్తి చేయాలని బీజేపీ నేతలు ఆర్. శేషసాయి, పి. సాయికృష్ణ యాదవ్‌లు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో జలమండలి, జీహెచ్ఎంసీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని వారు హెచ్చరించారు. గురువారం అడిక్‌మెట్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అడిక్‌మెట్ డివిజన్‌లోని సౌమ్య ఆస్పత్రి పక్కన ఉన్న స్ట్రీట్ నంబర్ 18లో ఆరు నెలల క్రితం డ్రైనేజీ పైప్‌లైన్‌లు నిర్మించారు. కానీ పైప్‌లైన్‌లు వేసిన చోట రోడ్డు ప్యాచ్ వర్క్ పనులు చేయకపోవడంతో వర్షాలకు గుంతలు పడి వాహనదారులు, పాదచారులు పడిపోయి ప్రమాదాలకు గురవుతున్నారని అన్నారు. వెంటనే ప్యాచ్ వర్క్ పనులు చేయాలని జీహెచ్ఎంసీ అధికారులను డిమాండ్ చేశారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

బర్కత్‌పుర, మే 23 (ఆంధ్రజ్యోతి): పట్టాలు దాటుతుండగా గుర్తు తెలియని వ్యక్తి రైలు ఢీకొని మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పీఎస్ పరిధిలోని సీతాఫల్‌మండి రైల్వే స్టేషన్ వద్ద జరిగింది. హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణచారి తెలిపిన వివరాల ప్రకారం... 28 ఏళ్ల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి రైల్వే స్టేషన్‌లోని ఐదో ప్లాట్ ఫాం వద్ద పట్టాలు దాటుతుండగా రైలు ఢీ కొట్టింది. తీవ్రగాయాలు కావడంతో ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుడి శరీరంపై పింకు కలర్ టీషర్టు, నీలిరంగు జీన్స్ పాయింట్ ఉంది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తాగునీటి లీకేజీని అరికట్టేందుకు చర్యలు

● రూ.3.6 కోట్లతో భారీ పైప్‌లైన్ నిర్మాణ పనులు


నిర్మాణానికి సిద్ధంగా ఉన్న భారీ పైపులు

ముషీరాబాద్, మే 23 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ ప్రధాన రోడ్డులో మెట్రో రైలు స్టేషన్ కిందిభాగంలో తాగునీటి పైప్‌లైన్ లీకేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు త్వరలో పైప్‌లైన్ నిర్మాణ పనులు చేపట్టనున్నారు. నిర్మాణ పనులకు రూ.3.6 కోట్ల రూపాయలు మంజూరయ్యాయి. ముషీరాబాద్ చౌరస్తా నుంచి అరకిలోమీటర్ వరకు భారీ పైప్‌లైన్ నిర్మాణ పనులు చేపట్టనుండడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడనుంది. ట్రాఫిక్ సమస్యను అధికమించేందుకు జలమండలి, జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీస్ అధికారుల సమన్వయంతో చర్యలు చేపట్టారు. మెట్రో పిల్లర్లకు ఎలాంటి నష్టం కలగకుండా నిర్మాణ పనులు చేపట్టేందుకు జలమండలి ఉన్నతాధికారులు ప్రణాళికా బద్ధంగా పనులు కొనసాగించేందుకు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

నిర్మాణ పనుల సమయంలో వాహనాల రాకపోకలకు ఆటంకం కలగకుండా ఉండేందుకు ట్రాఫిక్‌ను మళ్లించేందుకు ట్రాఫిక్ సెంట్రల్ జోన్ ఏసీపీ, ట్రాఫిక్ సీఐలు వాహనాల దారి మళ్లింపుపై చర్యలు తీసుకున్నారు. పైప్‌లైన్ నిర్మాణం అనంతరం రోడ్డు పనులు చేపట్టే విధంగా జీహెచ్ఎంసీ అధికారులు సిద్ధంగా ఉన్నారు. సంవత్సర కాలంగా రోడ్డుపై నుంచి తాగునీరు లీకేజీ అవుతుండటంతో మంచినీరు వృథాగా పోవడంతోపాటు రోడ్లు అధ్వానంగా మారుతున్నాయి. ఈ సమస్య ఎట్టకేలకు పరిష్కారానికి నోచుకుంటుండడం విశేషం.

ఇబ్బంది లేకుండా పనులు చేపట్టాలి



ముషీరాబాద్ ప్రధాన రోడ్డులో భారీ పైప్‌లైన్ నిర్మాణం వల్ల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి, ముషీరాబాద్ నుంచి ఆర్టీసీ క్రాస్ రోడ్డు వైపు వెళ్లేందుకు ప్రధాన రోడ్డు కావడంతో ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా పనులు పూర్తి చేసి వాహనాల రాకపోకలు సాఫీగా సాగేలా చర్యలు తీసుకోవాలి.

-ప్రశాంత్, స్థానికుడు

పైప్‌లైన్ నిర్మాణానికి నిధులు మంజూరు



ముషీరాబాద్ ప్రధాన రోడ్డులో తాగునీటి పైప్‌లైన్ లీకేజీని అరికట్టేందుకు రూ.3.6 కోట్లు మంజూరు చేయించాం. ఫిబ్రవరి నెలలో నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశాం. నిర్మాణ పనులకు ట్రాఫిక్, జీహెచ్ఎంసీ నుంచి అనుమతులు లభించడంలో కొంత జాప్యం జరిగింది. వెంటనే పైప్‌లైన్ నిర్మాణ పనులు పూర్తి చేస్తాం.

-ముఠాగోపాల్,ముషీరాబాద్ ఎమ్మెల్యే


సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

స్థానిక సంస్థల బీసీ రిజర్వేషన్లలో వర్గీకరణ చేపట్టాలి

● పలువురు వక్తలు

రాంనగర్, మే 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల బీసీ రిజర్వేషన్లలో ఏ, బీ, సీ, డీ వర్గీకరణ చేసి అందరికీ బీసీల అన్ని తరగతులకు అందించాలని పలువురు వక్తలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల బీసీ రిజర్వేషన్లు వర్గీకరణ లేకపోవడంతో బీసీలకు తీరని అన్యాయం జరుగుతుందని వారన్నారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మేదరి సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు జోరిగల శ్రీనివాస్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ముఖ్య అతిథులుగా ప్రొఫెసర్ ఎస్. సుదర్శన్‌రావు, పైళ్ల ఆశయ్య, ప్రొఫెసర్ బాగయ్య, ఎన్. వి. రమణ, పల్లపు విగ్నేష్, వెంకటకృష్ణ, కుమారస్వామి, గోపి, సుధాకర్, రాజేష్, బాలరాజు, సుధాకర్, మల్లేశం, గోపాల్ తదితరులు హాజరై మాట్లాడారు. స్థానిక సంస్థల రిజర్వేషన్లలో ఏబీసీడీ వర్గీకరణ లేకపోవడం శోచనీయమన్నారు. న్యాయస్థానాలు తెలిసినా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు.


బస్తీ నాయకుడు వల్లాల రవియాదవ్‌కు చెక్కును అందజేస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర యువజన నాయకుడు ముఠా జైసింహ

ఉన్నికోట బస్తీ దేవాలయానికి లక్ష విరాళం

కవాడిగూడ, మే 23 (ఆంధ్రజ్యోతి): కవాడిగూడ డివిజన్ ఉన్నికోట బస్తీలోని అమ్మవారి ఆలయ అభివృద్ధికి ఎమ్మెల్యే ముఠాగోపాల్ రూ. లక్ష విరాళం ప్రకటించారు. గురువారం ఉన్నికోట బస్తీ వాసులకు బీఆర్ఎస్ రాష్ట్ర యువజన నాయకుడు ముఠా జైసింహ లక్ష రూపాయల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి ఆలయం ఎంతో ప్రసిద్ధి చెందిందని, ఆలయాన్ని అభివృద్ధి చేసుకోవడానికి ఈ విరాళాన్ని అందజేసినట్లు జైసింహ తెలిపారు. ఈ సందర్భంగా ఉన్నికోట బస్తీ వాసులు ఎమ్మెల్యే ముఠాగోపాల్‌కు చెక్కు అందజేసిన జైసింహకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు వల్లాల శ్యామ్‌యాదవ్, నగర నాయకులు శ్రీనివాస్ యాదవ్, బస్తీ వాసులు శివ, వెంకటేష్, నందాల సురేష్, నర్సింగ్, బీఆర్ఎస్ నాయకులు వెల్లంకి ఇంద్రసేనారెడ్డి, ముదిగొండ మురళి, పూస గోరక్‌నాథ్ తదతరులు పాల్గొన్నారు.

సోషియాలజీలో కొత్త కోర్సులను సద్వినియోగం చేసుకోవాలి

● నిజాం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బీమా


సోషియాలజీ కోర్సుల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బీమా

బర్కత్‌పుర, మే 23 (ఆంధ్రజ్యోతి): సోషియాలజీలో నూతనంగా ప్రవేశపెట్టిన కోర్సులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని నిజాం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్. బీమా సూచించారు. గురువారం కళాశాలలో సోషియాలజీ కోర్సుల బ్రోచర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోషియాలజీలో కోర్సులను పూర్తిచేసిన విద్యార్థులు మెరుగైన ఉపాధి అవకాశాలు పొందవచ్చన్నారు. నిజాం కళాశాల సోషియాలజీ విభాగం ఇన్‌చార్జి హెడ్ డాక్టర్. డి. తిరుపతి మాట్లాడుతూ బీఏ సోషియాలజీలో (హెచ్ఎస్‌జీ, పీఎస్‌పీ, పీఎస్ఎం, ఎస్‌యూపీ) నాలుగు గ్రూప్‌లతో నూతన కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎంఏ సోషియాలజీలో పీజీ డిప్లొమా ఇన్ క్రిమినాలజీ అండ్ కరక్షనల్ అడ్మినిస్ట్రేషన్, పీజీ డిప్లొమా ఇన్ డెవలప్‌మెంట్ మేనేజ్‌మెంట్ అండ్ రీసెర్చ్ మెథడాలజీ, హ్యూమన్ రైట్స్ అండ్ పర్సనాలిటీ డెవలప్‌మెంట్ కోర్సులను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఈ విద్యా సంవత్సరం నుంచే విద్యార్థులు నూతన కోర్సులలో చేరవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్. పి.మాలతి, డాక్టర్. సీహెచ్. పరంధాములు, స్టూడెంట్ అడ్వయిజర్ మహ్మద్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బుద్ధ జయంతి


హుస్సేన్‌సాగర్‌లోని బుద్ధ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

రాంనగర్, మే 23 (ఆంధ్రజ్యోతి): బుద్ధుడు చూపించిన మార్గాలను నేటి యువత పాటిస్తూ సన్మార్గంలో ముందుకు సాగాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సిరిగిరి శ్యామ్ సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గౌతమ బుద్ధుడి బోధనలు నేటి యువత పాటిస్తూ భవిష్యత్ మార్గాలను ఎంచుకోవాలన్నారు. గౌతమ బుద్ధుడి జయంతిని పురస్కరించుకుని గురువారం బీఆర్ఎస్ పార్టీ తరఫున హుస్సేన్‌సాగర్‌లోని బుద్ధ విగ్రహానికి ఆయన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రజలతో పనిచేసిన ఆచరణాత్మక విప్లవకారుడు గౌతమ బుద్ధుడు అని పేర్కొన్నారు. బోధితత్వ భగవాన్ బుద్ధగా ప్రపంచ చరిత్రలో నిలిచిపోయారని అన్నారు. స్మామ్రాట్ అశోకచక్రవర్తి, బాబాసాహెబ్ అంబేద్కర్‌లకు దారిచూపిన మహాబోధుడు గౌతమ బుద్ధుడు అని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాకం సత్యనారాయణ, జంగం అరుణ్, అరవింద్, ఔటా వెంకటేష్, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

పోగొట్టుకున్న బ్యాగ్ ప్రయాణికురాలికి అప్పగింత

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, మే 23 (ఆంధ్రజ్యోతి): రైల్వే స్టేషన్‌లో పోయిన బ్యాగ్‌ను సీఆర్‌పీఎఫ్ పోలీసులు బాధితురాలికి అప్పగించారు. లింగంపల్లి రైల్వే స్టేషన్ ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ మనోజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన కుమారి సద్రోసి గురువారం లింగంపల్లి రైల్వే స్టేషన్‌కు వెళ్లింది. నర్సాపూర్ రైలు కోసం వేచి చూస్తుంది. కొద్ది సేపటి తర్వాత చూసుకోగా బ్యాగు కనిపించకపోవడంతో ఆర్పీఎఫ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు ప్లాట్‌ఫాంపై గాలించి మరోచోట లభించిన బ్యాగ్‌ను ఆమెకు అప్పగించారు.

వ్యక్తి అదృశ్యం

అడ్డగుట్ట, మే 23 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి కనిపించకుండాపోయాడు. లాలాగూడ ఎస్ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. లాలాగూడ శాంతినగర్‌కు చెందిన మహ్మద్ సాదిక్(42) ప్రవేట్ ఉద్యోగి. ఈనెల 16న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతడి ఆచూకీ లభించకపోవడంతో భార్య తరుణం ఈనెల 23న పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భార్యతో గొడవలు, అనారోగ్యం..

● జీవితంపై విరక్తితో ఓ వ్యక్తి బలవన్మరణం

అల్వాల్, మే 23 (ఆంధ్రజ్యోతి): దంపతుల మధ్య గొడవలు.. అనారోగ్యంతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. అల్వాల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఇందిరానగర్ కానాజీగూడ ప్రాంతానికి చెందిన పల్లె ప్రమోద్‌కుమార్(40) తల్లితో కలిసి నివసిస్తున్నాడు. భార్య సౌజన్యతో కొన్ని సంవత్సరాలుగా మనస్పర్థల కారణంగా ఇద్దరి మధ్య తరుచుగా గొడవలు జరుగుతున్నాయి. దీంతో విడాకుల కోసం కోర్టును ఆశ్రయించారు. దీంతో ప్రమోద్‌కుమార్ మానసికంగా కుంగిపోయాడు. దానికి తోడు అనారోగ్యానికి గురవడంతో జీవితంపై విరక్తి చెందాడు. బుధవారం రాత్రి తల్లితో కలిసి భోజనం చేసి, తన రూమ్‌లోకి వెళ్లి నిద్రపోయాడు. గురువారం ఉదయం 7 గంటలకు నల్లా నీళ్లు పడదామని తల్లి ప్రమోద్ కుమార్‌ను పిలువగా పలకలేదు. రూమ్‌లోకి వెళ్లి చూడగా ఫ్యాన్‌కు ఉరేసుకుని వేలాడుతూ ఉన్నాడు. ఆమె వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.


పూలే విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నేతలు మహేందర్ బాబు, తదితరులు

కోల్‌కతా హైకోర్టు తీర్పు హర్షణీయం

కవాడిగూడ , మే 23 (ఆంధ్రజ్యోతి): బెంగాల్‌లో ముస్లింలను ఓబీసీ జాబితాలో చేర్చడాన్ని ఆ రాష్ట్ర హైకోర్టు కొట్టి వేయడం హర్షణీయమని కవాడిగూడ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు మహేందర్‌బాబు అన్నారు. గురువారం మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి వినతిపత్రం సమర్పించి పశ్చిమ్‌బెంగాల్ సీఎం మమతాబెనర్జీ తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రంగరాజ్‌గౌడ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు పిఎన్ చారి, పూసరాజు, ఉమేష్, డివిజన్ ప్రధాన కార్యదర్శులు ప్రభాకర్‌గంగపుత్ర, కేశవరాజు, బొల్ల రమేష్, తొలుపునూరి రమేష్‌గౌడ్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

చిక్కడపల్లి, మే 23(ఆంధ్రజ్యోతి): బీసీల సంక్షేమాన్ని కాంక్షించే వారు కోల్‌కతా హైకోర్టు తీర్పును స్వాగతించాలని ముషీరాబాద్ నియోజకవర్గం బీజేపీ ఓబీసీ మోర్చా కన్వీనర్ ఉమేష్ అన్నారు. గురువారం గాంధీనగర్ డివిజన్ అరుంధతినగర్ బస్తీలోని పూలే విగ్రహం వద్ద ఆయన పూస రాజుతో కలిసి నివాళులర్పించారు.

రాంనగర్, మే 23 (ఆంధ్రజ్యోతి): మతపరమైన రిజర్వేషన్లపై హైకోర్టు ఇచ్చిన తీర్పును గౌరవించని బెంగాల్ సీఎం మమతా బెనర్జీపై చర్యలు తీసుకోవాలని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పూస రాజు అన్నారు. గురువారం అడిక్‌మెట్‌లోని పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, మే 23(ఆంధ్రజ్యోతి): ఆజామాబాద్, హైదరాబాద్ సిటీ-1 పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈలు విజయభాస్కర్, ప్రేమానంద్‌పాయ్ తెలిపారు. రామాలయం, కవాడిగూడ పరిధిలో ఉదయం 11 నుంచి 12.30 వరకు, బ్రాహ్మణ్ హాస్టల్, బ్యాంక్ ఆఫ్ బరోడా పరిధిలో 12.30 నుంచి 2, కమలానగర్, జగదాంబ నర్సింగ్‌హోమ్ పరిధిలో మధ్యాహ్నం 2.30 నుంచి 4, సీపీఎల్, గోశాల పరిధిలో సాయంత్రం 4 నుంచి 5 వరకు సరఫరా ఉండదన్నారు.

లీలాకృష్ణ ఆర్ట్స్ సంస్థ ప్రారంభం

చిక్కడపల్లి, మే 23(ఆంధ్రజ్యోతి): లీలాకృష్ణ ఆర్ట్స్ సంస్థ త్యాగరాయగానసభలో ప్రారంభమైంది. తరిగొండ వెంగమాంబ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం పోతన భాగవత సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్‌బీఐ మాజీ ఏజీఎం, గాయకుడు చింతలపూడి త్రినాథరావు ముఖ్యఅతిథులుగా పాల్గొని లీలాకృష్ణ సంస్థను ప్రారంభించారు. ఈ సందర్భంగా త్రినాథరావు మాట్లాడుతూ సమాజంలో భక్తి భావాన్ని పెంపొందించడంలో ఆధ్యాత్మిక సంస్థలు చేస్తున్న కృషి గొప్పదన్నారు. ఈ సందర్భంగా పలువురు గాయనీగాయకులు సంకీర్తనలు, పద్యాలు, భక్తిగీతాలను ఆలపించారు.

వైభవోపేతంగా శేషవాహన సేవ

చిక్కడపల్లి, మే 23 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం శేషవాహన సేవ కనులపండువగా జరిగింది. స్వామివారి శేషవాహన సేవ భక్తి శ్రద్ధలతో నిర్వహించి చిక్కడపల్లి శ్రీనివాసపురం తిరువీధుల్లో ఊరేగించారు. ఆలయ వ్యవస్థాపక వంశీయుడు రాజేంద్రనాథ్‌గౌడ్ కుమారుడు శ్రీనాథ్‌గౌడ్, కీర్తి దంపతులు, ఈవో రామాంజనేయులు ఏర్పాట్లు పర్యవేక్షించి ప్రత్యేకపూజల్లో పాల్గొన్నారు.

సోనమ్‌సింగ్‌కు మోస్ట్ ప్రొఫెషనల్ మేకప్ ఆర్టిస్ట్ అవార్డు


కియారా అద్వాని నుంచి అవార్డు అందుకుంటున్న సోనమ్ సింగ్

బర్కత్‌పుర, మే 23 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ మేకప్ ఆర్టిస్ట్ సోనమ్ సింగ్‌కు బెస్ట్ అండ్ మోస్ట్ ప్రొఫెషనల్ మేకప్ ఆర్టిస్ట్ అవార్డు 2024 వరించింది. నగరానికి చెందిన సోనమ్ సింగ్ ముంబాయిలో జరిగిన ఓ కార్యక్రమంలో ప్రముఖ బాలీవుడ్ సినీతార కియారా అద్వాని చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా సోనమ్ సింగ్ మాట్లాడుతూ ఈ అవార్డు రావడం సంతోషంగా ఉందని ఆమె చెప్పారు. ప్రముఖ సినీతార చేతుల మీదుగా ఈ అవార్డు అందుకోవడం తన బాధ్యతలను మరింత పెంచిందని ఆమె చెప్పారు. భర్త కుటుంబ సహకారం వల్లనే ఈ అవార్డు అందుకునే స్థాయికి ఎదిగానని మేకప్ ఆర్టిస్ట్‌గా మరింతగా రాణించడానికి కృషి చేస్తానని ఆమె చెప్పారు.


సినీ నటుడు మురళీమోహన్ నుంచి అవార్డు అందుకుంటున్న డాక్టర్ విజయ్‌మోహన్

డాక్టర్ విజయ్‌మోహన్‌కు కామధేను అవార్డు

బర్కత్‌పుర, మే 23 (ఆంధ్రజ్యోతి): బర్కత్‌పురకు చెందిన డాక్టర్ ఎస్. విజయ్‌మోహన్‌కు డాక్టర్ కాకర్ల సుబ్బారావు మెమోరియల్ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ కామధేను అవార్డును అందుకున్నారు. వంశీ ఇంటర్నేషనల్ సోషియే కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ సినీ నటుడు మురళీమోహన్ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నట్లు గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వెల్లడించారు. డాక్టర్‌గా రోగులకు అందిస్తున్న సేవలను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేయడం సంతోషంగా ఉందన్నారు. పేదలకు మరిన్ని వైద్య సేవలందిస్తానని ఆయన తెలిపారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జనార్ధనమూర్తి, శంకరనారాయణ

విద్యాదానం ఉన్నతులుగా నిలబెడుతుంది

చిక్కడపల్లి, మే 23 (ఆంధ్రజ్యోతి): కళా విద్యాదానం ఉన్నతులుగా నిలబెడుతుందని, జీవితాలను కాపాడుతుందని ప్రముఖ జర్నలిస్ట్, హాస్యావధాని శంకరనారాయణ అన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో గురువారం రాత్రి రచయిత అంజన గోలి(అమెరికా) రచించిన బెటర్ ట్రాజెక్టరీస్ ఆంగ్ల వ్యాస సంపుటి గ్రంథావిష్కరణ కళాసుబ్బారావు కళావేదికలో జరిగింది. ముఖ్యఅతిథిగా గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శంకరనారాయణ మాట్లాడుతూ అంజన గోలి అమెరికాలో స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయంలో విద్య అభ్యసిస్తూ పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ వ్యక్తిత్వ వికాస వ్యాస రచనతో సాహితీసేద్యం చేస్తున్నారని ప్రశంసించారు. ఏడు విభాగాలలో నేటి యువతరానికి మార్గనిర్దేశనం చేసే అంశాలు అంజన ఈ పుస్తకంలో ప్రస్తావించారని వివరించారు. జనార్ధనమూర్తి మాట్లాడుతూ అంజన గోలి సోదరితో కలిసి గానసభలో చిన్ననాడు గీతా శ్లోకాలు ఆలపించిన విషయం గుర్తుచేశారు. ప్రముఖ జర్నలిస్ట్ ఎల్లాప్రగడ మల్లికార్జునరావు సంపుటిని విశ్లేషణ చేస్తూ మానవ జీవితం సన్మార్గంలో నడవడానికి దానం ధర్మగుణం అవసరమని వాటిగురించి అంజన వివరించారని తెలిపారు. మంచి సమాజ నిర్మాణం కోసం ఉత్తమ సాహిత్యం అవసరమన్నారు. సాహితీవేత్త విశ్వేశ్వరరావు సంపుటిలోని అధ్యాయాలను పరిచయం చేశారు.

విదేశాల్లో అన్నమయ్య సంకీర్తనలు

చిక్కడపల్లి, మే 23 (ఆంధ్రజ్యోతి): దేశవిదేశాల్లో అన్నమయ్య సంకీర్తనలు శ్రుతులు, శాస్త్రాలు, మంత్రాలుగా మార్మోగుతున్నాయని మాజీ ప్రభుత్వ సలహాదారు డా. కేవీ రమణాచారి అన్నారు. నవ్యనాటక సమితి, అన్నమాచార్య మిషన్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి త్యాగరాయగానసభలో తాళ్ళపాక అన్నమయ్య 616వ జయంతి శ్రీపదార్చన పేరిట యాభై మంది యువ కళాకారులు అన్నమయ్య కీర్తనలను నృత్యరూపంలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా రమణాచారి మాట్లాడుతూ అన్నమాచార్య సంకీర్తనలకు తనదైన వ్యాఖ్యానంతో కీర్తి గడించిన కామిశెట్టి శ్రీనివాసులు వారసురాలుగా గోదాలక్ష్మి సాంస్కృతిక బంధువు వేమరాజు నరసింహారావు వారసుడిగా విజయకుమార్‌లు వారి ఆశయాలను కొనసాగిస్తున్నారని ప్రశంసించారు. అన్నమయ్య కీర్తనలను గతంలో సాహిత్యంగా గుర్తించని పరిస్థితి ఉండేదన్నారు. కామిశెట్టి శ్రీనివాసులు విషయపరిజ్ఞానంతో అన్నమయ్య కీర్తనలకు వ్యాఖ్యానం చేశారని గుర్తుచేశారు. ప్రముఖ నృత్యకళాకారిణి పద్మినికి ఆత్మీయ సత్కారం చేశారు. రాష్ట్ర ఖజానా లెక్కల శాఖ ఉప సంచాలకులు వసుంధర, పోలీస్ ఉన్నతాధికారి విజయకుమార్, ఆచార్య ఫణీంద్ర, రజిత అకుల, కామిశెట్టి గోదాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సొంత ఐడీతో అధిక ధరకు రైల్వే టికెట్ల విక్రయం

● నిందితుడి అరెస్ట్

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, మే 23 (ఆంధ్రజ్యోతి): సొంత ఐడీతో అక్రమంగా అధిక ధరకు రైల్వే టికెట్లు విక్రయిస్తున్న ఓ వ్యక్తిని ఆర్పీఎఫ్ పోలీసులు అరెస్ట్ చేశారు. యూసుఫ్‌గూడ వెంకటగిరి ప్రాంతానికి చెందిన ముడావత్ శ్రీను సొంత ఐడీతో అధిక ధరకు రైల్వే టికెట్లు విక్రయిస్తున్నాడు. ఫిర్యాదు అందడంతో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారించారు. 26 మందికి రైల్వే టికెట్లు విక్రయించినట్లు అంగీకరించాడు. అతడి నుంచి రూ. 8,827 విలువగల 12 టికెట్లను స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా రైల్వే టికెట్లు విక్రయిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్పీఎఫ్ నాంపల్లి ఇన్‌స్పెక్టర్ కల్పన హెచ్చరించారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.